సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 11 । జూలై । 2023



కళాకారులకు పెద్దపీట

కళాకారుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. 8లో▸



కార్మికులను ఆదుకోవాలి

కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, సుధాకర్ కోరారు. 8లో▸

గడువు పొడిగింపు

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం 2023–24వ విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల సమర్పణకు గడువు తేదీని ఈనెల 15 వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలుగుయూనివర్సిటీ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

న్యూస్‌రీల్

నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ కె.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్స్ కోర్సుల్లో ఈ నెల 18 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి చదివిన మహిళలు ఈ నెల 17 వరకు చిలుకూరులోని ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారానికి ఎస్‌ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేయాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యంతోపాటు యూనిఫాం, టూల్ కిట్స్ ఇస్తామని చెప్పారు. వివరాలకు 86390 79122, 79819 51167, 90007 78300 నంబర్లలో సంప్రదించాలి.

యాదవులు ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న రమేష్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన యాదవులకు దక్కాల్సిన రాజకీయ, ఆర్థిక, సామాజిక వాటా కోసం సమష్టిగా ఉద్యమించాలని అఖిల భారత యాదవ మహాసభ యువజన రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఆ మహాసభ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌యాదవ్ అధ్యక్షతన సోమవారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ యాదవ్ మాట్లాడుతూ.. ఏ రాజకీయ పార్టీ అయినా,ఏ ప్రభుత్వమైనా యాదవుల జనాభా ప్రకారం 22 మంది ఎమ్మెల్యేలకు, 5 ఎంపీలకు,7ఎమ్మెల్సీలకు అవకాశం కల్పించాలన్నారు. ఐక్యంగా ఉంటేనే గుర్తింపు ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బెల్లి లలిత వర్ధంతిని, జయంతిని అధికారికంగా నిర్వహించాలని, ప్రతి మండల, నియోజకవర్గ కేంద్రంలో ఆమె విగ్రహాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కడారి జంగయ్య, మర్రిపల్లి అంజయ్య, ఎలిగపల్లి నారాయణ, చింతం బాలరాజు, కసరమోని మల్లేశ్, దండే శ్రీశైలం, ముచ్చర్ల వెంకటేశ్, నడికుడి రఘునాథ్, చీమల కృష్ణ, పాలమోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 228 ఫిర్యాదులు



ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అనూహ్య స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జనం తమ సమస్యలను అధికారులకు మొరపెట్టుకునేందుకు వచ్చారు. వివిధ అంశాలపై 228 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్ తిరుపతిరావు వారి నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హుడాకాంప్లెక్స్: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4, 5వ తరగతులకు సంబంధించి (హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్) ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఎంపికలను జూలై 5వ తేదీలోపు నిర్వహిస్తారని, ఎంపికైన బాల బాలికలు మాత్రమే జిల్లా స్థాయిలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈనెల 14న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలు జిల్లా స్థాయిలో నిర్వహించే ఎంపిక ప్రక్రియలో పాల్గొంటారని, జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. మూడు దశల్లో జరిగే ఎంపికలో 4, 5వ తరగతుల్లో 10 మంది చొప్పున బాలబాలికలను ఎంపిక చేస్తామన్నారు. 4వ తరగతి కోసం 8 నుంచి 9 సంవత్సరాల మధ్య వయస్సు, 5వ తరగతికి 9 నుంచి 10 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, ప్రోగ్రెస్ కార్డ్, బోనఫైడ్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

మార్గం.. నాణ్యత మృగ్యం



ఇది నాదర్‌గుల్ ప్రధాన రహదారి నుంచి కమ్మగూడకు వెళ్లే మార్గం. కంకరతేలి, ప్రయాణానికి ఇబ్బందిగా మారడంతో సీసీ రోడ్డు కోసం ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. 250 మీటర్ల పొడవు, 18 అడుగుల వెడల్పుతో పది నెలల క్రితం పనులు పూర్తి చేశారు. రోడ్డు వేసి ఏడాది పూర్తికాక ముందే పగుళ్లు ఏర్పడి, మళ్లీ గుంతలమయంగా మారింది. సీసీ రోడ్డు పనులు ఎంత నాసిరకంగా ఉన్నాయో చెప్పేందుకు ఇదో నిదర్శనం.



ఇటీవల మొయినాబాద్ నుంచి సురంగల్ వరకు (2 కి.మీ) బీటీ రోడ్డు వేశారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు పనులు జరగలేదు. తారు, కంకర సహా ఇతర ముడిపదార్థాలు నాసిరకంగా ఉన్నట్లు క్వాలిటీ కంట్రోల్ అధికారులు గుర్తించారు. కాంట్రాక్టర్ సహా పంచాయతీరాజ్ ఇంజనీర్‌పై అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

రోడ్డు పనుల్లో చేతివాటం
- నాసిరకంగా పనులు
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికారగణం
- వేసిన మూన్నాళ్లకే యథాస్థితికి
- ప్రజాధనం మరమ్మతుల పాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏదైనా రోడ్డు వేసే ముందు నేల స్వభావాన్ని బట్టి గట్టిదనం వచ్చే వరకు జేసీబీతో తవ్వాలి. తొలగించిన లూజు మట్టి స్థానంలో గట్టి మొరం నింపాలి. దానిపై రోడ్డు రోలర్‌తో తొక్కించి, రోలింగ్ పూర్తయిన తర్వాత రెడ్‌మిక్స్ పోయాలి. ఆ తర్వాత సీసీ/ బీటీ వేయాలి. మెజార్టీ ప్రాంతాల్లో మట్టిపై నేరుగా సీసీ/తారు పోస్తున్నారు. ఫలితంగా వరద నీటి ప్రవాహానికితోడు భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు కుంగిపోయి.. గుంతలు ఏర్పడుతున్నాయి. పదేళ్ల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్డు ఏడాది తిరగక ముందే గుంతలు తేలుతోంది. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే రోడ్డు పనులే కాదు స్టేట్‌హైవే పనులు సైతం నాసిరకంగా ఉంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేమికి తోడు నాసిరకమైన పనులతో వేసిన కొద్ది కాలానికే దెబ్బతిని వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. డ్రైనేజీ కాల్వల పరిస్థితి సైతం అధ్వానంగా తయారైంది. సిమెంట్ ఇటుకలతో నిర్మించిన మ్యాన్‌హోళ్లకు కనీసం ప్లాస్టింగ్ చేయడం లేదు. క్యూరింగ్ చేయకుండానే వాటి చుట్టూ మట్టిని నింపి, కనిపించకుండా మూతలతో 'కవర్' చేస్తున్నారు. వాటి చుట్టూ పగుళ్లు ఏర్పడి, పందికొక్కులు, ఎలుకలకు స్థావరాలుగా మారుతున్నాయి. పైపుల నిండా మట్టి చేరి పూడిపోతున్నాయి. వర్షాకాలంలో వరదలకు రోడ్డుపైనే పొంగుతున్నాయి.

మున్సిపాలిటీల్లో 'లెస్సు'లో టెండర్లు

పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ సహా మున్సిపాలిటీల ఆధ్వర్యంలో రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. వీటిలో పీఆర్, ఆర్ అండ్‌బీ రోడ్డు పనులు చేపట్టేందుకు మెజార్టీ కాంట్రాక్టర్లు వెనుకాడుతున్నారు. ఆస్తిపన్ను ఎక్కువగా వసూలయ్యే బడంగ్‌పేట్, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, శంషాబాద్, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల్లో రోడ్డు, డ్రైనేజీ పనులకు కాంట్రాక్టర్లు పోటీ పడుతున్నారు. పని చేసిన వెంటనే బిల్లులు వస్తుండటంతో ఇక్కడ చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు పోటీ పడుతున్నారు. ఇంజనీర్లు వేసిన అంచనాలకు భిన్నంగా లెస్సులో టెండర్లు దాఖలు చేస్తున్నారు. ఇలా 'లెస్సు'లో టెండర్లు దక్కించుకున్న వారు తర్వాత పనుల విషయంలో నాణ్యత పాటించడం లేదు. ఎప్పటికప్పుడు పనుల తీరును పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు ఆయా కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు స్వీకరించి, కిమ్మనకుండా బిల్లులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పీఆర్‌లో పర్సంటేజీల పర్వం

2021–22లో రూ.51కోట్ల అంచనా వ్యయంతో 111 గ్రామీణ రహదారుల మరమ్మతు పనులు చేపట్టగా, ఇందులో ఇప్పటికే 48 పనులు (65.13 కి.మీ బీటీ రోడ్డు) పూర్తి చేశారు. 2022–23లో రూ.136 కోట్ల అంచనా వ్యయంతో 87 రహదారులకు మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించి, ఇప్పటికే 48.63 కిలోమీటర్లకు సంబంధించి 17 పనులు పూర్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.54 కోట్ల అంచనా వ్యయంతో 160 పనులు చేపట్టాలని నిర్ణయించారు. జిల్లా పరిషత్ స్పెషల్ గ్రాంట్స్‌తో రూ.1.19 కోట్ల అంచనా వ్యయంతో 18 పనులు ప్రారంభించారు. ఈఎంఎస్ (ఎస్సీ) పద్దు కింద 8.5 కోట్ల అంచనా వ్యయంతో 21 పనులు, వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పద్దు కింద రూ.33 కోట్ల అంచనా వ్యయంతో 43 పనులు, ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ పద్దు కింద రూ.39.19 లక్షల అంచనా వ్యయంతో 13 పనులు, జిల్లా పరిషత్ జనరల్ ఫండ్ పద్దు కింద రూ.1.82 కోట్ల అంచనా వ్యయంతో 39 పనులు, ఈఎంఎఫ్ (ఎస్టీ) పద్దు కింద రూ.12 లక్షల అంచనా వ్యయంతో మూడు పనులు చేపట్టారు. మెజార్టీ పనులు జెడ్పీటీసీలు, ఎంపీపీలే చేజిక్కించుకుని, బినామీ కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. వారు అడిగినంత పర్సంటేజీలు ఇస్తే చాలు నాణ్యతతో పని లేకుండా పీఆర్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తుండటం విశేషం.

ప్రశ్నార్థకంగా ఆర్‌అండ్‌బీ రోడ్ల నాణ్యత

రోడ్ల భవనాల శాఖ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.304 కోట్ల అంచనా వ్యయంతో 19 పనులు (100 కి.మీ రోడ్డు) చేపట్టగా, మహేశ్వరంలో రూ.270 కోట్ల అంచనా వ్యయంతో 15 పనులు (98.68 కి.మీ రోడ్డు), చేవెళ్లలో రూ.86 కోట్ల అంచనా వ్యయంతో 80.21 కిలోమీటర్ల పొడవు రోడ్డు (19 పనులు), రాజేంద్రనగర్‌లో రూ.41 కోట్లతో తొమ్మిది పనులు (19.23 కి.మీ) చేపట్టగా, షాద్‌నగర్‌లో రూ.275 కోట్ల అంచనా వ్యయంతో 15 ప్రాంతాల్లో 90.56 కిలోమీటర్ల రోడ్డు పనులు చేపట్టింది. ఇక కల్వకుర్తిలో రూ.32 కోట్ల అంచనా వ్యయంతో 35.94 కిలోమీటర్ల పనులు చేపట్టింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

ప్రమాదంలో ఆరేళ్ల బాలిక దుర్మరణం



భావన (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఆడుకోవడానికి వెళ్లిన చిన్నారి అనంత లోకాలకు చేరుకుంది. బస్సు రూపంలో వచ్చిన మృత్యువు కబళించుకుపోయింది. అమ్మా అంటూ ఆ బాలిక చివరి ఆర్తనాదాలు పెట్టింది. ఈ హృదయ విదారక సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం కుర్మల్‌గూడలోని రాజీవ్‌గృహకల్పలో నివసించే మిర్యాల విజయలక్ష్మి, వేణుగోపాల్ దంపతులు. వారికి ముగ్గురు సంతానం. వారిలో పెద్దపాప హితిషా, చిన్నపాప భావన (6), కుమారుడు భానుప్రసాద్ ఉన్నారు. మల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో పిల్లలు చదువుతున్నారు. భావన యూకేజీ చదువుతోంది. సోమవారం ఉదయం బడికి వెళ్లిన పిల్లలు సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చారు. భావన ఆడుకోవడానికని ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. ఇంటి ముందు ఆడుకుంటుండగా బాలాపూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు (టీఎస్ 07యుజీ 3293) డ్రైవర్ చూసుకోకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో భావనను ఢీకొట్టాడు. చిన్నారి తల మీద నుంచి బస్సు వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం అయి అక్కడికక్కడే మృతి చెందింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అప్పటి వరకు ఆనందంగా ఆడుకుంటున్న బిడ్డ అంతలోనే అనంతలోకాలకు చేరడంతో వారి ఆవేదనకు అంతు లేకుండా పోయింది. ప్రమాదానికి కారణమైన బస్సు ముందు ఆందోళన చేపట్టారు. పోలీసులు ఆందోళన చేస్తున్నవారికి సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యత



గంగారం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హర్షగూడ, గంగారం, మహేశ్వరం, మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామాల్లో ఉన్న నర్సరీలను ఆమె ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేసి, మొక్కలు పెంచి గ్రామంలో అవసరమైన చోట నాటుతున్నట్లు చెప్పారు. హర్షగూడలో మొక్కల సంరక్షణ సరిగ్గాలేదని పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డీపీఓకు సూచించారు. అనంతరం ఘట్టుపల్లిలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో హరితహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, డీఆర్‌డీఓ ప్రభాకర్, డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీడీ నీరజ, ఎంపీడీఓ నర్సింహ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల డిమాండ్స్‌డేను పురస్కరించుకొని సోమవారం ప్రాజెక్టుల వారీగా బొంగ్లూర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రాగన్నగూడ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భగా చంద్రమోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీసీ, ఐసీడీఏసీ నిధులను 100 శాతం పెంచాలని, 60 శాతం నిధులను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. 45 ఏళ్లుగా ఉన్న అంగన్‌వాడీ ఆయా, టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు కిషన్, బుగ్గరాములు, తులసిగారి నర్సింహ, పోచమోని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జూనియర్ కళాశాలల్లో బోధకులేరి?

- సబ్జెక్టు లెక్చరర్లు లేక ఇబ్బందులు
- సగానికిపైగా ఖాళీలు
- తగ్గుతున్న విద్యార్థుల హాజరు శాతం
- కుంటుపడుతున్న ఇంటర్ విద్య

సాక్షి, సిటీబ్యూరో: సాక్షాత్తు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వెంటాడుతోంది. పూర్తి స్థాయిలో అధ్యాపకులు లేకపోవడంతో తరగతుల నిర్వహణ అంతంత మాత్రంగా తయారైంది. ఫలితంగా విద్యార్థుల హాజరు శాతం కూడా తగ్గుముఖం పడుతోంది. వెరసి ఇంటర్ విద్య ఆశించినంతగా సాగని పరిస్థితి నెలకొంది. గ్రేటర్ పరిధిలో సుమారు 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 22, రంగారెడ్డి జిల్లా పరిధిలో 18, మేడ్చల్ పరిధిలో 6 కళాశాలలు ఉన్నాయి. మొత్తం మీద కళాశాలల్లో సగానికి పైగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వాస్తవంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్, గెస్ట్ అధ్యాపకులతో బోధన కొనసాగుతూ వస్తోంది. ప్రతి యేటా అడ్మిషన్ల సంఖ్య పెరుగుతున్నా.. అధ్యాపకుల ఖాళీలు మాత్రం వెక్కిరిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి ముఖ్యమైన సబ్జెక్టులను బోధించే అధ్యాపకుల కొరత ఏర్పడింది. వాస్తవంగా ఈ ఏడాది సిలబస్‌ను త్వరగా పూర్తి చేయాలని ఇంటర్మీడియెట్ బోర్డు లక్ష్యంగా నిర్ణయించుకున్నప్పటికీ ముందుకు సాగని పరిస్థితి. అటు ప్రైవేటులో వేగంగా బోధన జరుగుతున్నా.. ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం పూర్తిగా వెనుకబడింది.

ఇంకా విధులకు దూరమే..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంకా గెస్ట్ లెక్చరర్లు విధులకు దూరంగానే ఉన్నారు. అధ్యాపకుల కొరత అధిగమించేందుకు ప్రతియేటా గెస్ట్ లెక్చరర్ల సేవలు వినియోగిస్తుంటారు. కానీ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా.. ఇంకా గెస్ట్ లెక్చరర్ల భర్తీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఫలితంగా విద్యాబోధన ముందుకు సాగడం లేదు. సాధారణంగా గత విద్యా సంవత్సరంలో విధులు నిర్వహించిన పాత గెస్ట్ లెక్చరర్లనే కొనసాగించే అనవాయితీ ఉంది. కానీ, ప్రతి యేటా అనుమతి అవసరం. గెస్ట్ లెక్చరర్లకు ఒక్కో తరగతికి గానూ రూ.300 చొప్పున.. నెలకు రూ.21,600 వేతనంగా చెల్లిస్తారు. కానీ ఇప్పటి వరకు గ్రీన్ సిగ్నల్ లభించలేదు.

అందని పాఠ్యపుస్తకాలు..

ఇంటర్మీడియెట్ తరగతులు మొదలై నెలరోజులు గడిచినా.. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందలేదు. బోధించేందుకు సరిపడా లెక్చరర్లు లేరు. దీంతో ప్రభుత్వ ఇంటర్ విద్యార్థులు మాత్రం దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ జూనియర్, మోడల్, కేజీబీవీ, గురుకుల జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తోంది. పుస్తకాల ముద్రణ బాధ్యతను తెలుగు అకాడమీ చూసుకుంటోంది. ఈ ఏడాది పుస్తకాలు ఇంకా అందుబాటులోకి రాలేదు. ముద్రణకు అవసరమైన కాగితాన్ని సమకూర్చుకోవడంలో జాప్యం కారణంగా ఈ ఆలస్యం జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రైవేటు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇప్పటికే వారికి సమకూరాయి.

వేర్వేరు కేసుల్లో రూ.1.17 కోట్ల బంగారం పట్టివేత



శంషాబాద్: రెండు వేర్వేరు కేసుల్లో 1.93 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం తెల్లవారు జామున దుబాయ్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి ముందస్తు ప్రణాళికతో తమ వద్ద ఉన్న అక్రమ బంగారు బిస్కెట్లు 1 కేజీ 399 గ్రాములను ఎయిర్‌పోర్టులో ఉద్యోగికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కస్టమ్స్ అధికారులు వారిద్దరిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో జెడ్డా నుంచి వచ్చిన మరో ప్రయాణికుడిని తనిఖీ చేయగా మలద్వారంలో క్యాప్సుల్స్ చేసి తీసుకొచ్చిన 526 గ్రాముల బంగారం బయటపడింది. రెండు కేసుల్లో కలిపి మొత్తం బంగారం విలువ 1.17 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

విదేశీ సిగరెట్లు స్వాధీనం

సోమవారం తెల్లవారు జామున బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుంచి పెద్ద మొత్తంలో విదేశీ సిగరేట్లను స్వాధీనం చేసుకున్నారు. 62400 సిగరేట్లు ఇందులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కస్టమ్స్ సుంకం చెల్లించకుండా విదేశీ సిగరేట్లను తీసుకొచ్చిన ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఎండీఏలో ఉన్నతాధికారుల బదిలీలు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్లు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎంఏయూడీ ప్లానింగ్ డైరెక్టర్‌గా అలాగే హెచ్‌ఎండీఏ ప్లానింగ్–1 ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఉన్న ఎస్.బాలకృష్ణను హైదరాబాద్‌మెట్రో రైల్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. అలాగే ఆయనకు రేరా కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. డీటీసీపీ డైరెక్టర్‌గా ఉన్న కె.విద్యాధర్ హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్–1గా బాలకృష్ణ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే హెచ్‌ఎండీఏ–2 డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జీ.శివశరణప్పను ఎంఏయూడీ ప్లానింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీ (హౌసింగ్ నంబర్) డైరెక్టర్ కె.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టనున్నారు. మరోవైపు హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎం.రాజేంద్రప్రసాద్ నాయక్ సీసీపీగా బదిలీ అయ్యారు.

మహిళల కోసం 'స్త్రీ' సమ్మిట్

- లోగో ఆవిష్కరించిన కొత్వాల్ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మహిళల భద్రతను మరింత పెంచడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో (హెచ్‌సీఎస్‌సీ) కలిసి సిటీ పోలీసులు 'స్త్రీ' పేరుతో సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. నగర పోలీసు ప్రధాన కార్యాలయంగా ఉన్న బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో బుధవారం దీన్ని హోంమంత్రి మహమూద్ అలీ ప్రారంభించనున్నారు. 'షి ట్రయమ్ఫ్ విత్ రెస్పెక్ట్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్' అనే దాన్నే స్త్రీగా పరిగణిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన లోగోను కొత్వాల్ సీవీ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. వివిధ వర్గాలకు చెందిన మహిళలు, యువతులతో పాటు నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు సలహాలు, సూచనలు ఇస్తారు. స్త్రీ సమ్మిట్‌లో రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సైతం పాల్గొననున్నారు.



నెలరోజుల్లో డిగ్రీ కళాశాల భవనం పూర్తి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నెలరోజుల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఇంజనీరింగ్ ఈఈ కుమార్‌గౌడ్‌తో కలసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి సోమవారం కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2.40 లక్షల వ్యయంతో వినోబానగర్‌లో డిగ్రీ కళాశాల భవన నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులను వదిలి వెళ్లడంతో నిర్మాణంలో కొంత జాప్యం జరిగిందన్నారు. మంత్రి సబితారెడ్డితో మాట్లాడి భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు మరో రూ.46 లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేయించారని, దీంతో తిరిగి ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు కళాశాల భవనం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భానుగౌడ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభు, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



డిగ్రీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చేవెళ్ల మండలం తంగేడుపల్లికి చెందిన దేవయ్య (39)నగరంలోని గచ్చిబౌలిలో హౌస్ కీపింగ్ పని చేసుకుంటూ జీవనం సాగుస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం గచ్చిబౌలికి బైక్‌పై వెళుతూ ముందు వెళ్తున్న బైక్‌ను వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవయ్య అక్కడి కక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యా యి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం



అఫ్సారీ బేగం (ఫైల్)

పహాడీషరీఫ్: కుమారుడితో గొడవ పడిన ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై జానీ తెలిపిన వివరాల ప్రకారం.. అలైన్ హిల్స్‌కు చెందిన అఫ్సారీ బేగం(46) ఉస్మాన్‌నగర్‌లోని సక్సెస్ స్టార్ స్కూల్‌లో కేర్ టేకర్‌గా పని చేస్తుంది. ఈ నెల 4వ తేదీన తన కుమారుడు హాజీతో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. 5న ఉదయం పాఠశాలలకు వెళుతున్నానని చెప్పి ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ కోసం అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో కానీ 87126 62366 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కళాకారుల అభ్యున్నతికి పెద్దపీట

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



అయోధ్యపూర్ తండాలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: కళాకారుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన కళాకారుడు సింగర్ మురళీ రచించి పాడిన ఎవరురా అంజన్నకు కాదు అనే వారు అనే పాటల సీడీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది కవులు, కళాకారులు ఉన్నారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారుల పాత్ర ఎనలేనిదన్నారు. ప్రభుత్వం కళాకారుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తోందన్నారు. అనంతరం గాయకుడు మురళీ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, నాయకులు విశ్వం, దేవేందర్ యాదవ్, రాంబల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, శ్రావణ్‌కుమార్, బాలు నాయక్, సాయి ప్రసాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

కొందుర్గు: బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాల రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బైరంపల్లి, లాలాపేట, చెరుకుపల్లి, విశ్వనాథ్‌పూర్, లక్ష్మీదేవిపల్లి, అయోద్యాపూర్ తండాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే బైరంపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఉత్తరాసిపల్లిలో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ముట్పూర్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పుష్కలంగా నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ లాలయ్య, ఎంపీపీ జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

సంఘం జిల్లా కమిటీ డిమాండ్

- కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కల్లుగీత కార్మికులు

ఇబ్రహీంపట్నం రూరల్: కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరాటి వెంకటేశ్, బోయపల్లి సుధాకర్ కోరారు. గీత కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు 25 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సభ్యత్వం ఉన్న కల్లు గీత కార్మికులందరికీ మోపేడ్లు ఇవ్వాలన్నారు. మోకులు, కుల వృత్తిదారులకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. సొసైటీలకు భూమి, కల్లు విక్రయానికి మార్కెట్, జిల్లా కేంద్రంలో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలకు రూ.5వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాబయ్య, కటికపల్లి శ్రీనివాస్, ముత్యాలు, సత్తయ్యగౌడ్, వెంకటేశ్‌గౌడ్, బాస్కర్, ఈశ్వర్, మల్లేశ్, నిరంజన్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడు సిద్ధిక్‌తో తల్లిదండ్రులు

శంకర్‌పల్లి: తప్పిపోయిన బాలుడిని గంట వ్యవధిలో శంకర్‌పల్లి పోలీసులు తల్లిదండ్రులను అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.. శంకర్‌పల్లి చౌరస్తా వద్ద సోమవారం ఉదయం 11 గంటలకు ఓ బాలుడు ఏడుస్తూ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఎంత సేపు చూసినా బాలుడి కోసం ఎవ్వరూ రాకపోవడంతో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాలుడు వివరాలు, పోలీస్‌స్టేషన్‌లో ఉన్న విషయాన్ని సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న బాలుడు తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో బాలుడు సిద్ధిక్(4)ను తల్లిదండ్రులు వేణుగోపాల్, కళావతికు అప్పగించారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన న్యాయవాదిపై కేసు

మలక్‌పేట: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన హైకోర్టు అడ్వకేట్‌పై మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, గూడూరుకు చెందిన సోదరులు ఏపూరి రవీందర్‌రెడ్డి, ఏపూరి సుభాష్‌రెడ్డి మధ్య భూవివాదం కొనసాగుతోంది. రవీందర్‌రెడ్డి గూడూరు పోలీస్‌స్టేషన్‌లో సుభాష్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సుభాష్‌రెడ్డి మలక్‌పేట పీఎస్ పరిధిలోని కళ్యాణ్‌నగర్‌లోని హైకోర్టు అడ్వకేట్ రాపోలు ఆనంద్ భాస్కర్ ఇంట్లో ఉన్నట్లు సమాచారం అందడంతో ఆదివారం సాయంత్రం నేరుగా అక్కడికి వెళ్లారు. 41 సీఆర్పీసీ నోటీసులు ఇవ్వకుండా సుభాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు అడ్వకేట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో విధులను అడ్డుకున్నారని, నేరస్తుడికి ఆశ్రయం కల్పించారని గూడూరు ఎస్సై రాణా ప్రతాప్ ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి ఆనంద్ భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 21వేల జరిమానా విధిస్తూ ఎల్‌బీనగర్ 9వ అదనపు జిల్లా, పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పు చెప్పారు. స్పెషల్ పీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేకల రజినిఅనే వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి అదే ప్రాంతంలోని వస్త్ర దుకాణంలో పని చేస్తున్న యువతితో పరిచయం ఏర్పడింది. దీనిని ఆసరాగా తీసుకుని అతను తరచూ ఆమెను ఆటోలో ఎక్కించుకుని ఆమె ఇంటి వద్ద దిగబెట్టేవాడు. 2015, ఏప్రిల్ నెలలో ఆమెను ఆటోలో ఎక్కించుకుని చంపాపేట్‌లోని ఓ ఇంటికి తీసుకెళ్లాడు. ఆమెను నిర్బంధించి పలు మార్లు లైంగిక దాడికి పాల్పడి మరుసటి రోజు వదిలిపెట్టాడు. బాధితురాలు ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో ఆమె తండ్రి ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 21వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.

ఇన్వెస్ట్‌మెంట్ పేరిట టోకరా

ఇద్దరి నుంచి రూ.52 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఇద్దరు వ్యక్తులను సైబర్ మోసగాళ్లు రూ.52 లక్షలు దోచుకున్నారు. సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పార్ట్‌టైం జాబ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి టెలిగ్రామ్ ద్వారా సదరు యువకుడిని సంప్రదించాడు. తమ కంపెనీలో ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపాడు. మొదట్లో కొంత మొత్తంలో ఇన్వెస్ట్ చేయడంతో లాభాలు చెల్లించాడు. నమ్మకం కుదరడంతో పెద్ద మొత్తంలో పలు దఫాలుగా రూ.47 లక్షలు ఇన్వెస్ట్ చేయించి దోచేశారు. రాంనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ నుంచి ఇదే తరహాలో రూ.5లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు తదితరులు

- రూ. 46 లక్షల విలువ చేసే 250 కేజీల గంజాయి స్వాధీనం
- ఐదుగురు నిందితుల అరెస్టు
- రెండు ఇన్నోవాలు స్వాధీనం

భాగ్యనగర్‌కాలనీ: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.46 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకొకున్నారు. సోమవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. మియాపూర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అల్లావుద్దీన్, పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన ఎండీ వాహిద్ ఈ నెల 8న ఏపీలోని మారేడుమిల్లికి వెళ్లి 230 కేజీల గంజాయిని కొనుగోలు చేసి ఇన్నోవాలో జహీరాబాద్‌కు తరలించేందుకు సన్నాహాలు చేపట్టారు. వీరికి సంగారెడ్డికి చెందిన అజిత్ వంశీ, విజయ్ మరో ఇన్నోవాలో ఎస్కార్ట్‌గా వచ్చారు. దీనిపై సమాచారం అందడంతో కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద మాదాపూర్ ఎస్ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మారేడుమిల్లి నుంచి కొనుగోలు చేసిన గంజాయిని జహీరాబాద్‌కు తరలించి అక్కడి నుంచి నగరానికి సరఫరా చేయాలని పథకం వేసినట్లు నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారు. వారి నుంచి సుమారు 230 కేజీల గంజాయి, రెండు ఇన్నోవా కార్లు, 5 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరికి మీడియేటర్‌గా పని చేసిన కిషన్‌బాగ్‌కు చెందిన అఖిల్‌ను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా అల్లావుద్దీన్‌పై గతంలో దొంగతనం, మర్డర్ తదితర మూడు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. అతనిపై పీడీ యాక్ట్ నమోదుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ శోభన్, కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, ఎస్ఓటీ సీఐ శివప్రసాద్, కూకట్‌పల్లి సీఐ సురేందర్ గౌడ్, డిఐ వెంకటేశం, ఎస్ఓటీ సిబ్బంది ఉన్నారు.

యజమాని ఇంటికే కన్నం



వివరాలను వెల్లడిస్తున్న మేడ్చల్ జోన్ డీసీపీ సందీప్



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు



పోలీసుల అదుపులో నిందితులు

దుండిగల్: ఇద్దరు వ్యక్తులు తాము కిరాయికి ఉంటున్న యజమాని ఇంటికే కన్నం వేశారు. యజమాని ఇంట్లో లేని సమయంలో తాళాలు పగలగొట్టి రూ.21 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దుండిగల్ పోలీసులు వారిని అరెస్టు చేశారు. సోమవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ జోన్ డీసీపీ సందీప్ వివరాలు వెల్లడించారు. డి.పోచంపల్లి సారెగూడెంలో నివాసం ఉంటున్న ముకేశ్‌కుమార్ టార్పాలిన్ కవర్ల వ్యాపారం చేసేవాడు. రెండేళ్లుగా అతడి ఇంటి పెంట్‌హౌస్‌లో రాజస్థాన్‌కు చెందిన బావా, బావమరుదులు నితీష్ కుమార్, కమలేశ్ అద్దెకు ఉంటున్నారు. నితీష్ ఇంటి యజమాని గోదాములోనే పని చేస్తుండగా, కమలేశ్ ఓ పరిశ్రమలో టెక్నీషియన్‌గా పని చేసేవాడు. జల్సాలకు అలవాటు పడిన వీరి జీతం మొత్తం మద్యానికే సరిపోయేది. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న వారు యజమాని ఇంట్లో చోరీ చేయాలని పథకం వేశారు. గత నెల 26న ఇంటి యజమాని ముకేశ్ కుమార్ ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా సొంతూరికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించి వారు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.21 లక్షలు విలువైన బంగారం, వెండి ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన దుండిగల్ పోలీసులు సోమవారం ఉదయం బహదూర్‌పల్లి చౌరస్తాలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40.6 తులాల బంగారం, 2,969 గ్రాముల వెండి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. 15 రోజుల వ్యవధిలోనే నిందితులను చాకచక్యంగా పట్టుకున్న దుండిగల్ పోలీసులను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో మేడ్చల్ ఏసీపీ వెంకటరెడ్డి, దుండిగల్ సీఐ వై.రామకృష్ణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వై.హనుమాన్ గౌడ్, ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.